క్లుప్తంగా

నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గురువారం ఉదయం 8 గంటలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 51వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ అభిమాన సంఘం జిల్లా నాయకుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అభిమానులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కర్నె వెంకన్న, టీఆర్ బాలశౌరెడ్డి, జార్జిరెడ్డి, లూర్థుమారెడ్డి, నాగయ్య, ఇన్నారెడ్డి, ఆనందరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన రామాంజిగౌడ్


ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రామాంజిగౌడ్

గరిడేపల్లి : రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు రామాంజిగౌడ్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ


చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ రాజు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల గుడ్ న్యూస్ చర్చ్ ఆర్థిక సహాయంతో బుధవారం పలువురు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ఊటుకూరు రాజు మాట్లాడుతూ క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిస్కిల్లా, ఏసుదాసు, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా బచ్చలకూరి వెంకటేశ్వర్లు



గరిడేపల్లి : ఐఎన్‌టీయూసీ గరిడేపల్లి మండల అధ్యక్షుడిగా బచ్చలకూరి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. బుధవారం హుజూర్‌నగర్ డివిజన్ విద్యుత్ 327 ఐఎన్‌టీయూసీ యూనియన్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన కేవీ సురేష్, దర్మారావు, రంగారావు, సైదులు, నాగరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఐటీయూలోకి అంగన్‌వాడీ టీచర్ల సంఘం సభ్యులు


మాట్లాడుతున్న శీలం శ్రీను

మఠంపల్లి : టీఆర్‌ఎస్‌కేవీ సంఘంలో పనిచేస్తున్న మఠంపల్లి మండల అంగన్‌వాడీ టీచర్ల సంఘం సభ్యులు బుధవారం ఆ సంఘానికి రాజీనామా చేసి స్థానికంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను సమక్షంలో సీఐటీయూ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా గుర్రం లింగమ్మ, అధ్యక్షురాలిగా బానోతు నీలాబాయి, కార్యదర్శిగా మంజుల, ఉపాధ్యక్షురాలిగా సంతోషికుమారి కమిటీ సభ్యులుగా రాజ్యలక్ష్మి, సంధ్య, నాగమణి, రంజాన్‌బీ, నాగలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం శీలం శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రసూల్‌మియా, తదితరులు ఉన్నారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వీరన్న

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నడిగూడెం ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ వీరన్న కోరారు. బుధవారం మండలంలోని వేణుగోపాలపురంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు ఎస్‌కె.లతీఫ్, పరబ్రహ్మాచారి, బండారు వెంకన్న, శివ, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆటలు లేవ్.. బోర్డులే దర్శనం

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారుల వేడుకోలు



కాగితరామచంద్రాపురంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం



తెల్లబల్లిలో పల్లె ప్రకృతి వనం వద్ద క్రీడా ప్రాంగణం పేరిట ఏర్పాటు చేసిన బోర్డు

నడిగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 సంవత్సరంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అయ్యాయి. ఏర్పాటు చేసిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉంటున్నాయి. నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, రత్నవరం, చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయితీలు ఉండగా అన్ని గ్రామాల్లో నిర్మించారు. అయితే ఇందులో సగానికి పైగా వినియోగంలో లేవు. గ్రామాలకు దూరంగా నిర్మించడం, కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయడం, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా లేకపోవడంలో వారు అందులో ఆటలు ఆడుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రస్తుతం ఈ క్రీడా ప్రాంగణాలు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని క్రీడాకారులే ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ధాన్యం ఆరబోయడానికి వినియోగిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించేనా..

కాగా, క్రీడా ప్రాంగణాలను ఎకరం స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ గ్రామాల్లో స్థలం కొరతతో పదిగుంటల్లో అధికారులు నిర్మాణాలు చేపట్టారు. స్వాగత తోరణం, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పిల్లర్ల కోసం రూ.55 వేలు వెచ్చించారు. స్థలాన్ని చదును చేసేందుకు అక్కడ ఉన్న స్థలాన్ని బట్టి మరిన్ని నిధులు మంజూరయ్యాయి. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా ఆ దశగా చర్యలు చేపట్టలేదు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకొస్తుందని క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



మా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఆ క్రీడా ప్రాంగణం ఊరికి దూరంగా ఉండడంతో ఎవరూ ఉపయోగించుకోలేకపోతున్నారు. వేల రూపాయలతో ఏర్పాటు చేసినా నిరుపయోగంగానే ఉంటోంది. అధికారులు వినియోగంలోకి తేవాలి.

– నేలమర్రి శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు, రామాపురం

పశువులను కట్టేస్తున్నారు



మా గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపాన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఎలాంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. ఆ ప్రాంగణంలో పశువులను కట్టేస్తున్నారు. వరి కోతల సమయంలో ధాన్యం ఆరబోసుకుంటున్నారు. అధికారులు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– షేక్.రహీం, కాగితరామచంద్రాపురం

విద్యుత్ సబ్ స్టేషన్లలో నేడు గ్రీవెన్స్ డే

చిలుకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల కోసం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ట్రాన్స్‌కో ఏఈ కె.సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేసి, పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో గురువారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే వినియోగదారులు దరఖాస్తులు ఇస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా, డివిజన్ అధికారులు హాజరు అవుతారని పేర్కొన్నారు.

కోదాడఅర్బన్ : విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకునేందుకు గురువారం కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పట్టణ విద్యుత్ ఏఈ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు పట్టణ విద్యుత్ ఏఈ మల్లెల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డేకు విద్యుత్ శాఖ డివిజన్, జిల్లా, మండల అధికారులు అందరూ పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారని తెలిపారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురంలో గల విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ హారిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రీవెన్స్ డేకు విద్యుత్ జిల్లా, డివిజన్ అధికారులు హాజరవుతారని ఆమె తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అధికారులకు దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు.

టీఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కాటమయ్య

హుజూర్‌నగర్ : టీఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన పెదపంగ కాటమయ్య ఎన్నికయ్యారు. ఈమేరకు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ) సమావేశం బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవయ్య ఆశయాలు సాధించాలి

కోదాడరూరల్ : కోదాడ ప్రాంతంలో సీపీఐ పార్టీ బలోపేతానికి కృషి చేసిన కమతం రాఘవయ్య ఆశయాలను సాధించాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి, కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామంలో రాఘవయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతురాజు సత్యనారాయణ, గొట్టెముక్కుల కోటి నారాయణ, కమతం పుల్లయ్య, జీవిరాజు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న పాతకాలం బావులు


నడిగూడెంలో దుర్వాసన వెదజల్లుతున్న పాతకాలం బావి

నడిగూడెం : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పాతకాలం నాటి బావులు శిథిలావస్థకు చేరాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు బావిలో చెత్తాచెదారం వేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్లల్లోని మురుగు నీరు బావుల్లోకి చేరుతుండడంతో బావి పరిసర ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాతకాలం నాటి బావులను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సవరించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని, తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పేరాల శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారెడ్డికి బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదలైన పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయన కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల ఆర్థికసాయం అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బాలస్వామి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు


హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో స్వామివార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


హుజూర్‌నగర్ : శ్రీ జ్ఞానసరస్వతి ఆలయంలో..


హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాలమ్లీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంతో పాటు వేపలసింగారంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సేవాకాలం, ఆళ్వార్లకు మంగళాశాసనం, నాల్గవ పాశురతాత్పర్యం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయాల చైర్మన్లు గండు సైదులు, కర్ణ ఓబుల్‌రెడ్డి, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, ధర్మకర్తలు, భక్తులు అంజిరెడ్డి, శంభిరెడ్డి, కోటిరెడ్డి, సైదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గోదాదేవిని, శ్రీకృష్ణ పెరమాళ్ల వారిని మండపంలో అధిష్ఠింపజేసి పూజలు జరిపారు. శ్రీకృష్ణ గోదా, రామానుజ అష్టోత్తరాలతో, తులసి పూలతో అష్టోత్తర పూజలు జరిపించారు. సాయంకాలం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సారధ్యంలో ముడుంబ దామోదరాచార్యులు గోదాదేవి తులసి వనంలో అయోనిజగా ఆవిర్భవించిన చరిత్రను శ్రవణానందంగా వినిపించారు. కార్యక్రమంలో చైర్మన్, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రం, గోదా, రామానుజ అష్టోత్తరాలతో పూజలు, పాశుర పఠనం, ప్రబంధ పారాయణం గావించారు. తదుపరి తీర్థప్రసాదాల గోష్టి నిర్వహించారు. అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'హైవే'ల వెంట మద్యం జోరు

- నిబంధనలకు విరుద్ధంగా వైన్స్‌లు, బెల్ట్ దుకాణాల నిర్వహణ
- పేరుకు ఫ్యామిలీ దాబాలు.. లోపల అంతా మద్యంమయం
- మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు

సూర్యాపేట క్రైం : పలు జాతీయ రహదారుల వెంట మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో పలువురు వాహనదారులు మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడి మృత్యువాతపడుతున్నారు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం రహదారుల వెంట వైన్స్‌లు, బెల్టుదుకాణాలు ఏర్పాటు చేయడమే అని అంటున్నారు పలువురు వాహనదారులు. దీంతో ప్రమాదాల నివారణకు గతంలో ప్రభుత్వం హైవేకు 500మీటర్ల దూరంలో వైన్స్‌లు నిర్వహించాలని నిబంధనలు విధించింది. అది పట్టించుకోకుండా పలువురు నిర్వాహకులు వైన్స్‌లు, బెల్టుదుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా రోడ్లవెంట ఏర్పాటు చేసిన దాబాల్లో, హోటళ్లలో కూడా బయటి నుంచి మద్యం తెచ్చి సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి జోరుగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఎక్సైజ్, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద ప్రతి ఏటా కేసులు నమోదు చేస్తున్నా.. మరి దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు శూన్యం

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు..

సూర్యాపేట పట్టణం, సూర్యాపేట మండల పరిధిలోని అంజనాపురి కాలనీ, గాంధీనగర్, జనగామ క్రాస్‌రోడ్డు, రాయినిగూడెం, తిరుమలగిరి, చివ్వెంలలో అనధికారికంగా నడుస్తున్న దాబాల్లో, హోటళ్లలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. జనగామ క్రాస్‌రోడ్డులో పదుల సంఖ్యలకు పైగా దాబాలు, హోటళ్లు ఉన్నాయి. వాటిలో నిర్వాహకులు మద్యం అమ్మకాలు సిట్టింగ్‌లు చేయిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకు దాబాల్లో, హోటళ్లు తెరిచే ఉంచి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా ఈ ఏడాదిలో ఒక్క జనగామ క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ క్రాస్‌రోడ్డులోనే మద్యం సేవించి ప్రమాదాలకు గురై పది మందికి పైగా మృత్యువాత పడ్డారు. అధికారులు రోడ్ల వెంట మద్యం విక్రయాలు చేస్తున్న దాబాలు, హోటళ్లలో బెల్ట్‌షాపుల్లో, వైన్స్‌ల్లో మద్యం అమ్మకాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

సర్పంచ్‌పై ఎంపీడీఓకు గ్రామస్తుల ఫిర్యాదు


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామ సర్పంచ్ శ్యామలేటి కోటేష్ తన ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీ నికర ఆస్తులను దుర్వినియోగం చేశారని గ్రామస్తులు బుధవారం మండల అభివృద్ధి అధికారి హరిసింగ్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన సిరికొండ వాగులో తాగునీటి బోరును అమ్ముకున్నాడని, పాత గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెందిన వేప చెట్లు విక్రయించి పాత గ్రామ పంచాయతీకి రేకులు వేయిస్తానని చెప్పి వేయించలేదని, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో జియో టవర్ ఏర్పాటు చేయించాడని, శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించలేదని, అందులో మరుగు దొడ్లకు నీటి సరఫరా చేయించడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కి అనేక సార్లు విన్నవించుకున్నా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఎంపీడీఓ సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోట సుధాకర్ రెడ్డి, గునగంటి రమేష్, కుంచ గోపి, తండు సంజీవ, వెంకటరెడ్డి, వి.వెంకన్న, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం


ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌రావు మండలంలోని పెంచికల్‌దిన్న పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బట్టు మధు నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీపై వచ్చారు. బుధవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రావు, బట్టు మధును ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ చిలకరాజు శ్రీను, హాస్టల్ వార్డెన్ చందులాల్, సైదులు, రషీద్‌ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, అన్నపూర్ణ నర్సింహారావు, మాధవి, రవి, కృష్ణప్రసాద్, కళ్యాణి, కల్పన, స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

కనుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ


18 మెట్లపై జ్యోతులు వెలిగిస్తున్న గురుస్వాములు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగాఅర్చకుడు విష్ణుబొట్ల హరిప్రసాద్‌శర్మ వేదమంత్రోచ్చారణలతో శివుడు, అయ్యప్పస్వామికి నవరస పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివార్లను తీరొక్క పూలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. విశేష హారతులు, నీరాజన మంత్రపుష్పాలు, 18 మెట్లకు జ్యోతులు వెలిగించి పూజలు నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్ నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణిపుల్లారెడ్డి, స్వామి పుల్లయ్య, సీతారాంసింగ్, అర్వపల్లి సత్యనారాయణ, సైదయ్య, రంగా, అయ్యప్ప, శివ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

874 సర్వే నంబర్ భూముల పరిశీలన


భూములను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని 874 సర్వే నంబర్ భూమిలో మంగళవారం రాత్రి ఓ సిమెంట్ పరిశ్రమ వారు బ్లాస్టింగ్ చేసే క్రమంలో కొందరు రైతులు అడ్డుకున్నారు. పేలుడు దాటికి రాళ్లు పడి తమ పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ వారు తమ పొలాలను బీడు భూములుగా మార్చి వారి సొంతం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కాగా ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో స్పందించిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం 874 సర్వే నంబర్ భూములను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతి, ఆర్‌ఐ వాసుదేవరావు, తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రమాదకరం


బేతవోలులో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉంది. గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు నిర్మించడంతో పూర్వం మండలంలో గ్రామీణ నీటి పారుదల శాఖ ద్వారా నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. అవి వాడకంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. చిలుకూరులో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తుంగతుర్తి : మాదకద్రవ్యాలు రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ప్రపంచ మానవాళి పురోభివృద్ధికి పెనుభూతాలైన గంజాయి బ్రౌన్‌షుగర్, కొకైన్ లాంటి మాదకద్రవ్యాల వినియోగంతో ప్రజల ఆరోగ్యానికి హానీ జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేసే వారి వివరాలను పోలీసులకు తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత


నడిగూడెంలోని బీసీ కాలనీలో రోడ్డుపై ఏర్పడిన గుంత

నడిగూడెం : మండల కేంద్రంలోని బీసీ కాలనీ నుంచి బస్టాండ్‌కు వెళ్లే దారిలో డ్రైయినేజీ పైపు దెబ్బతిని గుంత ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా ఉండాలి



వీడ్కోలు వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కోదాడఅర్బన్ : జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు మార్గదర్శకులుగా ఉండాలి కోదాడ కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ అన్నారు. బుధవారం కళాశాలలో డిప్లొమా ఫైనల్ విద్యార్థినులకు వీడ్కోలు, మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్వాగత కార్యక్రమం జరిగింది. నీలా సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి విదేశాల్లో మంచి స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వైజర్‌లు పోతుగంటి నాగేశ్వరరావు, డాక్టర్ సీహెచ్.నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ, హెచ్‌వోడీలు రమేష్, జనార్దన్, స్రవంతి, నరేష్‌రెడ్డి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.